www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 121 | 22-10-2026 | గురువారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## 'పురుషాధిక్య వర్గం'గా ఆర్ఎస్ఎస్

### మహిళలను పురుషుల ఆస్తిగా చూసే ఆర్ఎస్ఎస్‌తో నా పోరాటం ఆగదు!

- నేను శివశక్తిని నమ్ముతా.. ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం ఆనందం: రాహుల్ గాంధీ

.. వివరాలు 4లో

"ఆర్ఎస్ఎస్ అనేది కేవలం పురుషులతో కూడిన, రాజ్యాంగ వ్యతిరేక సంస్థ. మహిళలు పురుషుల ఆస్తి అని అది నమ్ముతుంది," అని రాహుల్ గాంధీ 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశారు. ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం తనకు ఆనందాన్నిస్తుందని చెప్పారు.

## సమాజాన్ని చీల్చేవారే దేశ శత్రువులు

### భారతీయ సంస్కృతిని ద్వేషించే శక్తులపై ఐక్యంగా పోరాడాలి

- 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలి
- ఢిల్లీ రావణ దహన వేడుకల్లో ప్రధాని మోదీ పిలుపు

3

సమాజంలో విభేదాలు సృష్టించే వ్యక్తులు, దేశ గౌరవాన్ని దెబ్బతీసే శక్తులు, భారతీయ సంస్కృతిని ద్వేషించే మనస్తత్వం ఉన్నవారిని దేశ శత్రువులుగా గుర్తించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అలాంటి శక్తులను దీటుగా ఎదుర్కొనేందుకు ప్రజలంతా ఐక్యంగా నిలవాలని, 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.





## ప్రపంచానికి తెలంగాణ వైభవం

03

- డిసెంబర్ 7 నుంచి 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్
- సంప్రదాయ కళారూపాలు, ఎయిర్ షో ఏర్పాటు
- ప్రధాన నగరాల్లో ప్రచారానికి సీఎస్ ఆదేశం
- ఈ నెల 24న హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్



## 19 రోజుల్లో 2 వేల కోట్లు!

- రాష్ట్రంలో భారీగా మద్యం విక్రయాలు
- గతేడాదితో పోలిస్తే 37 శాతం వృద్ధి

3

## మీరు ఒంటరి కాదు.. మేమున్నాం!

### గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి

అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

- కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు ఎక్స్‌గ్రేషియాను తమ ప్రభుత్వమే కోటికి పెంచిందని వెల్లడి
- హోంగార్డుల పరిహారం సైతం రూ.10 లక్షలకు పెంచాలని తాజాగా డీజీపీకి ఆదేశాలు
- 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీల భర్తీకి ముఖ్యమంత్రి హామీ



సమాజం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం గోషామహల్ స్టేడియంలో జరిగిన స్మారక పరేడ్‌లో డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

వివరాలు 2లో..

## మైసూరు దసరాలో సీఎం రేవంత్!

- జంబూ సవారిని వీక్షించిన ముఖ్యమంత్రి
- బంగారు అంబారీలో చాముండేశ్వరి దర్శనం

2






## ఎస్‌బీఐపై సైబర్ ఎటాక్!

3,897 మంది ఖాతాదారుల డేటా లీక్

.. వివరాలు 3లో



## షరతులతో సీజేపీ నేతలకు బెయిల్!

- తీహార్ జైలు నుంచి ఇద్దరి విడుదల..

.. వివరాలు 2లో



## భారత్‌లో జోక్యం చేసుకోం!

యూఎన్ వ్యాఖ్యలపై రూబియో స్పందన

.. వివరాలు 3లో

## మంత్రి కాన్వాయ్ అడ్డగింత!



- జైపూర్ మండలం కుందారంలో ఉద్రిక్తత
- సాగునీరు, కరెంట్ కోసం రైతుల ఆందోళన
- మంత్రి వివేక్ కాన్వాయ్ అడ్డుకున్న అన్నదాతలు

3

చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం కుందారం గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను స్థానిక రైతులు అడ్డుకున్నారు.



2

## క్షేత్రస్థాయికి వచ్చి మాట్లాడండి!

ప్రాజెక్టులను వదిలేసిన బీఆర్ఎస్ నేతలు నీళ్లడుగుతారా?

కేటీఆర్, నిరంజన్ రెడ్డిలకు మంత్రి జూపల్లి కౌంటర్

## జూపల్లి సవాల్‌కు నేను సిద్ధం!

- ప్రాజెక్టులపై చర్చకు రావాలి
- మంత్రికి నిరంజన్ రెడ్డి కౌంటర్
- ఆ పనులన్నీ కేసీఆర్ హయాంలోనివే

2





## వకుళాభరణం రచనా కృషికి ప్రశంస!

గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ తాను రచించిన పుస్తకాల అందజేత

3



# మైసూరు దసరాలో సీఎం రేవంత్!

**జంబూ సవారిని వీక్షించిన ముఖ్యమంత్రి**

**బంగారు అంబారీలో చాముండేశ్వరి దర్శనం**

**డీకే శివకుమార్ ఆహ్వానంతో వేడుకలకు హాజరు**

**రాష్ట్ర ప్రజల కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**మైసూరు (ఉద్యమ కెరటం):** కర్ణాటకలో అత్యంత వైభవంగా జరిగే చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ఆయన ఈ వేడుకలకు హాజరయ్యారు. ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన 'జంబూ సవారి'ని సీఎం వీక్షించారు. అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడానికి ముందు రాజభవనం వద్ద ఉన్న చాముండేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని ప్రార్థించారు. ఈ జంబూ సవారి ఊరేగింపులో కన్నడ సంస్కృతి, చారిత్రక వారసత్వం ఉట్టిపడేలా జానపద కళాకారులు, నృత్య బృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేరళ నేత వీడీ సతీశన్ సహా పలువురు దేశ, విదేశీ ప్రముఖులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాలను వీక్షించారు.



# క్షేత్రస్థాయికి వచ్చి మాట్లాడండి!

**ప్రాజెక్టులను వదిలేసిన బీఆర్ఎస్ నేతలు నీళ్లడుగుతారా?**

**కేటీఆర్, నిరంజన్ రెడ్డిలకు మంత్రి జూపల్లి కౌంటర్**

**నార్లాపూర్ నుంచి ఎల్లూరుకు వెయ్యి క్యూసెక్కుల నీరు**

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** తమ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిన బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. కేటీఆర్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తదితర విపక్ష నేతలు ఏవైనా మాట్లాడే ముందు ప్రాజెక్టుల వద్దకు వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. బుధవారం ఆయన నార్లాపూర్ జలాశయం నుంచి ఎల్లూరు జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నార్లాపూర్, ఏదుల మధ్య కాలువ తవ్వకాలు, సొరంగం పనులు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. ఆ పనులు పూర్తికాకుండానే పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేస్తే కాలువలకు నష్టం వాటిల్లుతుందన్న కనీస అవగాహన విపక్షాలకు లేకపోవడం శోచనీయమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా నీటి విడుదలను కోరడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్యాకేజీ-3 పనులు ఆలస్యమయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో మూడు నెలల సమయం పడుతుందన్నారు. కాగా, తాజా నీటి విడుదలతో కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాల్లో అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి వివరించారు.

# జూపల్లి సవాల్‌కు నేను సిద్ధం!

**ప్రాజెక్టులపై చర్చకు రావాలి**

**మంత్రికి నిరంజన్ రెడ్డి కౌంటర్**

**ఆ పనులన్నీ కేసీఆర్ హయాంలోనివే**



**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని తరలించే నిర్ణయంతో పాటు, ప్రస్తుతం మంత్రి ప్రారంభించిన తూము నిర్మాణం కూడా కేసీఆర్ హయాంలోనే జరిగాయని ఆయన గుర్తుచేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నందున ప్యాకేజీ-3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగించి వెంటనే నీటిని పంపింగ్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పాలమూరు-రంగారెడ్డి పనులు నిలిచిపోయాయని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన కాలువల నిర్మాణ టెండర్లను ఎందుకు రద్దు చేశారో, తిరిగి ఎందుకు పిలవలేదో జూపల్లి సమాధానం చెప్పాలని నిలదీశారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించిన వారిని సలహాదారులుగా నియమించుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మంత్రి జూపల్లికి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలపై ఉన్న శ్రద్ధ పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. తక్షణమే నిధులు విడుదల చేసి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# మీరు ఒంటరి కాదు.. మేమున్నాం!

- **గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి**

**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** సమాజం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం గోషామహల్ స్టేడియంలో జరిగిన స్మారక పరేడ్‌లో డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అమరులకు ఘనంగా నివాళులర్పించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్న సీఎం.. ఈ సందర్భంగా పోలీసుల సంక్షేమం, అమరుల కుటుంబాలకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. అమరుల కుటుంబాలకు గతంలో ఉన్న ఎక్స్‌గ్రేషియాను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారీగా పెంచిన విషయాన్ని సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుల్ కుటుంబానికి గతంలో రూ.40 లక్షలు పరిహారం ఉంటే దానిని ఏకంగా రూ.కోటికి పెంచామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐలకు ఉన్న రూ.45 లక్షల పరిహారాన్ని కూడా రూ.కోటికి, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుగా ఉన్న ఎక్స్‌గ్రేషియాను రూ.1.25 కోట్లకు పెంచామని వివరించారు. డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులకు రూ.1.50 కోట్లకు.. ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్లకు ఎక్స్‌గ్రేషియా పెంచామని సీఎం వెల్లడించారు. ఇది కేవలం ఆర్థిక సాయం కాదని, అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. అలాగే హోంగార్డుల పరిహారాన్ని సైతం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని అక్కడికక్కడే డీజీపీని ఆదేశించారు.

**2028 నాటికి ఖాళీలన్నీ భర్తీ..**

రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణే కీలకమని, అందుకే పోలీస్ శాఖకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. 2028 నాటికి పోలీస్ శాఖలో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 112 మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్లకు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించి వారి ఆత్మగౌరవాన్ని పెంచామని గుర్తుచేశారు. పోలీసు పిల్లల చదువుల కోసం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ప్రారంభించామని, ఇందులో హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు అందరి పిల్లలకూ అవకాశం కల్పించామన్నారు.

**కొత్త సవాళ్లు.. ఉక్కుపాదం!**

కాలంతో పాటు నేరాల స్వభావం మారుతోందని, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖను ఆధునీకరిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. సాంకేతికత ఎంత పెరిగినా పోలీసుల్లో మానవీయ దృక్పథం మారకూడదన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మహమ్మారుల బారిన యువత పడకుండా నిరోధించడంలో 'ఈగల్ ఫోర్స్' పనితీరు అద్భుతమని, ఈ సందర్భంగా డీజీపీని ఆయన అభినందించారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపేందుకు 'టీజీ సేఫ్' తీసుకొచ్చామన్నారు. మహిళల భద్రత కోసం మార్చిలో 'స్టాండ్ విత్ హర్', ఏప్రిల్‌లో 'స్పందన' తక్షణ రక్షణ బృందాలను ప్రారంభించామని, మహిళలు, చిన్నారుల కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు.



**మీకు మేమున్నాం..**

"మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు.. మీ కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరు. కానీ మీ బాధలో మీరు ఒంటరి కాదు.. తెలంగాణ సమాజం, పోలీస్ శాఖ, ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని అమరుల కుటుంబాలకు సీఎం ధైర్యం చెప్పారు. అదే సమయంలో పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ.. "మీ క్రమశిక్షణే మీ బలం.. నిజాయతీయే మీ గౌరవం.. ప్రజలకు మీరిచ్చే భరోసాయే మీకు లభించే గొప్ప గుర్తింపు. మీరు ప్రజల భద్రతకు అండగా నిలవండి.. మీ కుటుంబాల భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. అమరుల ఆశయాలను కొనసాగిస్తూ సురక్షిత తెలంగాణను నిర్మించుకుందాం" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం!

- **విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు డీజీపీ నివాళి**
- **గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**
- **ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది.. రాష్ట్రంలో ముగ్గురు అమరులు**
- **పోలీసు పిల్లల నాణ్యమైన విద్య కోసమే 'వైఐపీఎస్' స్కూల్**

**హైదరాబాద్ (ఉద్యమ కెరటం):** ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తీవ్రవాదం, నక్సలిజం, ఇతర అసాంఘిక శక్తులను ఎదుర్కొనే క్రమంలో వందలాది మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోగా.. అందులో తెలంగాణకు చెందిన ఏఎస్ఐ దేవ్‌సింగ్, కానిస్టేబుళ్లు ఎంపల్లి ప్రమోద్‌కుమార్, శీలం కరుణాకర్ ఉన్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకే ముఖ్యమంత్రి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్)ను ప్రారంభించారని, మంచిరేవులలో ఏప్రిల్ నాటికి శాశ్వత క్యాంపస్ పూర్తయితే 720 మందికి విద్య అందుతుందని వివరించారు.



**కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండాలి..**

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఆహార కల్తీ, రోడ్డు ప్రమాదాలు ప్రస్తుతం పోలీసులకు కొత్త సవాళ్లుగా మారుతున్నాయని డీజీపీ అన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సిబ్బంది నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక నేరాల నియంత్రణతో పాటు విజిబుల్ పోలీసింగ్‌ను కొనసాగించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ ఫోర్స్, ట్రాఫిక్ కోసం టీ-మార్స్ ద్వారా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ జనాభాలో కేవలం 0.3 శాతం మందికి మాత్రమే పోలీసు యూనిఫాం ధరించి ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కుతుందని, చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు నిబద్ధతతో సేవలందించడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని డీజీపీ స్పష్టం చేశారు.



# షరతులతో సీజేపీ నేతలకు బెయిల్!

**తీహార్ జైలు నుంచి ఇద్దరి విడుదల..**

**రూ.50 వేల పూచీకత్తుతో మంజూరు**

**ప్రశాంతతను కాపాడతామని కోర్టుకు హామీ**

**ప్రతి విచారణకు హాజరుకావాలని ఆదేశం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** జంతర్ మంతర్ వద్ద అనుమతి లేకుండా నిరసన తెలిపిన కేసులో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అక్టోబరు 13వ తేదీన నిరసనలపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ.. వారు ఆందోళన నిర్వహించడంతో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో వారు వారం రోజుల పాటు తీహార్ జైలులో రిమాండ్ అనుభవించి తాజాగా బెయిల్ పై విడుదలయ్యారు. న్యాయస్థానం సీజేపీ నేతల బెయిల్‌కు పలు కఠిన నిబంధనలు విధించింది. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు ఒక్కొక్కరు రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు పూచీదారులను కోర్టుకు సమర్పించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడబోమని, ప్రశాంత వాతావరణాన్ని కాపాడుతామని వారు కోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. జంతర్ మంతర్ వద్ద ఇకపై నిరసనలకు పిలుపునివ్వబోమని, ఆ ప్రాంతాన్ని అధికారికంగా మళ్లీ నిరసన స్థలంగా ప్రకటించే వరకు అక్కడ ఎలాంటి ఆందోళనల కోసం ప్రజలను సమీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే తాము భవిష్యత్తులో నిర్వహించే నిరసనలు, ప్రదర్శనలు అన్నీ రాజ్యాంగ పరిధికి లోబడే ఉంటాయని న్యాయస్థానానికి సీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించిన ప్రతి విచారణ తేదీన ఇద్దరూ విధిగా న్యాయస్థానానికి హాజరుకావాలని, ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడవద్దని కోర్టు వారిని ఆదేశించింది.

# నీటి ఎద్దడిపై సర్కార్ అలర్ట్!

- **రామప్ప చెరువును పరిశీలించిన మంత్రి సీతక్క**
- **గోదావరి నుంచి పంపింగ్‌కు కసరత్తు**
- **ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయం తగదు**
- **ఉపాధి హామీతో నీటి సంరక్షణ పనులు**

**ములుగు, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో గత ఆరు నెలలుగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నీటి సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని రామప్ప చెరువుతో పాటు అక్కడి డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టును మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రామప్ప చెరువులో ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందన్నారు. గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేసి చెరువులు, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరాను మరింత మెరుగుపరిచే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. నీటి నిల్వలు పెరిగేందుకు ఏటా ఇచ్చే విరామాన్ని పరిగణనలోకి తీసుకుని, మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా చూడాలని సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు. రామప్ప నుంచి నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీటి సరఫరా వ్యవస్థలు, చెరువులపై ఆధారపడిన గ్రామాలు, భూగర్భ జలాల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

**ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయం తగదు..**

అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి పరిణామాలను ఏ శక్తీ పూర్తిగా నియంత్రించలేదని, ఇలాంటి సంక్షోభ పరిస్థితులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని మంత్రి సీతక్క హితవు పలికారు. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులు వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గుర్తుచేశారు. ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు రాజకీయ విమర్శలు పక్కనపెట్టి సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

**ఉపాధి హామీతో నీటి సంరక్షణ..**

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణతో పాటు బోర్ల రీచార్జ్ పనులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. కూలీల సంఖ్యను పెంచి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే నీటి నిల్వలను పెంచుకోగలిగితే భవిష్యత్తులో నీటి ఎద్దడి తీవ్రతను అరికట్టవచ్చని చెప్పారు.

సాగునీటి అవసరాలతో పాటు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సీతక్క స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రామప్ప-లక్నవరం కాలువ వంటి ప్రతిపాదిత ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తాగునీటి సరఫరాను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని, నీటి సంరక్షణ చర్యల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచానికి తెలంగాణ వైభవం!

- డిసెంబర్ 7 నుంచి 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్
- సంప్రదాయ కళారూపాలు, ఎయిర్ షో ఏర్పాటు
- ప్రధాన నగరాల్లో ప్రచారానికి సీఎస్ ఆదేశం
- ఈ నెల 24న హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్



**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** రాష్ట్ర సాంస్కృతిక, కళా వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లపై బుధవారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ ద్వారా పెట్టుబడుల అవకాశాలతో పాటు రాష్ట్ర చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. సమ్మిట్ ప్రారంభంలో అతిథులకు తెలంగాణ సంప్రదాయ కళారూపాలతో స్వాగతం పలకాలని సీఎస్ సూచించారు. సదస్సులో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రక్షా ఎక్స్‌పో కొనసాగుతుందని, చివరి రోజైన 9వ తేదీన నిర్వహించే ఎయిర్ షోను తిలకించేందుకు ప్రజలు భారీగా వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక కల్చరల్ కార్నివాల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### ఎయిర్‌పోర్టుల్లో భారీ హోర్డింగులు..

సమ్మిట్‌కు సంబంధించి ఈ నెల 24న హైదరాబాద్‌లో, 29న దిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సీఎస్ తెలిపారు. ప్రచారం కోసం దిల్లీ, ముంబై, బెంగళూరు, శంషాబాద్ విమానాశ్రయాలతో పాటు ప్రముఖ ప్రాంతాలు, హోటళ్ల వద్ద ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. సినీ ప్రముఖుల భాగస్వామ్యంతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి సోషల్ మీడియా, మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, సీఎంఓ సీపీఆర్వో మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# 19 రోజుల్లో 2 వేల కోట్లు!

- రాష్ట్రంలో భారీగా మద్యం విక్రయాలు
- గతేడాదితో పోలిస్తే 37 శాతం వృద్ధి
- ఒక్కరోజే రూ.303 కోట్ల వ్యాపారం
- 30 లక్షల కేసులకు పైగా అమ్ముడైన బీర్లు

**హైదరాబాద్, అక్టోబర్ 22 (ఉద్యమ కెరటం):** దసరా పండుగ సీజన్ రాష్ట్రంలో మద్యం వ్యాపారానికి భారీ ఊతమిచ్చింది. పండుగ వేళ మందుబాబుల కొనుగోళ్లతో ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిసింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదైనట్లు ఎక్సైజ్ శాఖ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల విలువలో 37.02 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో అమ్మకాలు కొంత నెమ్మదిగా సాగినప్పటికీ.. రెండో వారం నుంచి విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ నెల 16వ తేదీ నాటికి రూ.1,527.85 కోట్లుగా ఉన్న మొత్తం అమ్మకాలు.. 19వ తేదీ నాటికి ఏకంగా రూ.2 వేల కోట్లను దాటేశాయి.

### బీర్లు, ఐఎంఎఫ్ఎల్ రికార్డ్ సేల్స్..

ఈ దసరా సీజన్‌లో బీర్ల వాటా ప్రత్యేకంగా కనిపించింది. అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 30.37 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో అమ్ముడైన 21.55 లక్షల కేసులతో పోలిస్తే ఇది 40.9 శాతం (8.82 లక్షల కేసులు అదనం) ఎక్కువ. అలాగే ఐఎంఎఫ్ఎల్ (హార్డ్ లిక్కర్) విక్రయాలు సైతం గత ఏడాది 14.16 లక్షల కేసుల నుంచి ఈసారి 18.38 లక్షల కేసులకు చేరి 29.80 శాతం మేర వృద్ధి సాధించాయి.

### ఒక్కరోజే రూ.303 కోట్లు..

దసరా సీజన్‌లో రోజువారీ విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయి. ఈ నెల 19న ఒక్కరోజే రాష్ట్రంలో



రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే అమ్మకాల విలువలో ఏకంగా 801.90 శాతం వృద్ధి నమోదైనట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పండుగ సందర్భంగా రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది.

# మంత్రి కాన్వాయ్ అడ్డగింత!



- జైపూర్ మండలం కుందారంలో ఉద్రిక్తత
- సాగునీరు, కరెంట్ కోసం రైతుల ఆందోళన
- మంత్రి వివేక్ కాన్వాయ్ అడ్డుకున్న అన్నదాతలు
- కారు దిగకుండానే వెళ్లిపోయారని రైతుల ఆగ్రహం

**జైపూర్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం కుందారం గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను స్థానిక రైతులు అడ్డుకున్నారు. తమ గోడును మంత్రికి చెప్పుకునేందుకు ప్రయత్నించిన అన్నదాతలపై ఆయన అనుచరులు ఎదురుదాడికి దిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీసం కారు దిగి తమతో మాట్లాడకుండా, సమస్యల పరిష్కారంపై ఎలాంటి భరోసా ఇవ్వకుండానే మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు సైతం బెదిరించారని వారు ఆరోపిస్తున్నారు. పంటలకు సాగునీరు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలన్న కనీస అవసరాలను అడుగుతుంటే.. ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమని రైతులు మండిపడుతున్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించి కుందారం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్‌బీఐపై సైబర్ ఎటాక్!

### 3,897 మంది ఖాతాదారుల డేటా లీక్
### డార్క్‌వెబ్‌లో కస్టమర్ల వ్యక్తిగత వివరాలు
### కోర్ బ్యాంకింగ్ సేవలు సురక్షితమేనన్న బ్యాంకు
### రంగంలోకి ఇండిపెండెంట్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ

**ముంబై, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సైబర్ దాడికి గురైంది. హ్యాకర్ల దాడి కారణంగా 3,897 మంది వినియోగదారుల వ్యక్తిగత డేటా లీకై డార్క్‌వెబ్‌లోకి వెళ్లినట్లు ఎస్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. ఈ డేటాలో కస్టమర్ల పేర్లు, మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీ, నివాస చిరునామాలు, ఈమెయిల్ ఐడీలతో పాటు లోన్ అప్లికేషన్ల సమాచారం ఉన్నట్లు తెలిసింది. డీసీఏ, సెర్ట్-ఇన్ వంటి సంస్థల హెచ్చరికలతో ఈ వ్యవహారం బయటపడింది. డార్క్‌వెబ్‌లో ఉన్న 3.75 లక్షల రికార్డులను విశ్లేషించగా.. అందులో 3,897 మంది ఎస్‌బీఐ కస్టమర్ల వివరాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్‌బీఐ యాక్షన్ ప్రోటోకాల్‌ను యాక్టివేట్ చేసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు సెర్ట్-ఇన్ ప్యానెల్‌లోని స్వతంత్ర సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీని రంగంలోకి దించింది. అయితే, ఈ సైబర్ దాడి వల్ల బ్యాంకు కోర్ ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ సేవలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రోజువారీ బ్యాంకింగ్ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతున్నాయని భరోసా ఇచ్చింది.




# వకుళాభరణం రచనా కృషికి ప్రశంస!

### గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ ..పుస్తకాల అందజేత
### లోక్‌భవన్‌లో ఆప్యాయ పలకరింపు.. వ్యాపకాన్ని కొనసాగించాలని గవర్నర్ సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు రచనా కృషిని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉత్తమ వ్యాపకాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను వకుళాభరణం తన సతీమణి సుధాశ్రీతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి సందర్భంగా జమ్మి ఆకులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. తాను రచించిన 'సామాజిక న్యాయం - ఆర్థిక సమానత్వం - అభివృద్ధి దిశగా జీఎస్టీ', 'శ్రీ నరేంద్ర మోదీ: భారత్‌ను విశ్వ వేదికపై నిలిపిన మహానాయకుడు', 'అంత్యోదయం నుంచి వికసిత్ భారత్', 'మోదీ వాణి: సేవ సంకల్పం, వికసిత భారత్' తదితర పుస్తకాలను వకుళాభరణం గవర్నర్‌కు అందజేశారు. పుస్తకాలను స్వీకరించిన గవర్నర్, అందులోని ముఖ్యాంశాలపై ఆయనతో ఆసక్తిగా చర్చించారు. అనంతరం వకుళాభరణం దంపతులతో గవర్నర్ ఆప్యాయంగా ముచ్చటించి వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో బీసీ కమిషన్ చైర్మన్‌గా, సభ్యుడిగా వకుళాభరణం చేపట్టిన కార్యక్రమాలు, అనుభవాలను శ్రద్ధగా విన్నారు. ఈ భేటీలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్ కూడా పాల్గొన్నారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, ప్రశంసలు తన రచనా వ్యాసంగానికి మరింత ప్రోత్సాహాన్నిచ్చాయని వకుళాభరణం పేర్కొన్నారు.



# సమాజాన్ని చీల్చేవారే దేశ శత్రువులు!

### భారతీయ సంస్కృతిని ద్వేషించే శక్తులపై ఐక్యంగా పోరాడాలి
### 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలి
### ఢిల్లీ రావణ దహన వేడుకల్లో ప్రధాని మోదీ పిలుపు
### శ్రీరాముడి ఆదర్శాలు, రామరాజ్య స్థాపనే మన లక్ష్యం
### వికసిత్ భారత్ సాధన కోసం రాజకీయ పార్టీలు ఏకం కావాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** సమాజంలో విభేదాలు సృష్టించే వ్యక్తులు, దేశ గౌరవాన్ని దెబ్బతీసే శక్తులు, భారతీయ సంస్కృతిని ద్వేషించే మనస్తత్వం ఉన్నవారిని దేశ శత్రువులుగా గుర్తించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అలాంటి శక్తులను దీటుగా ఎదుర్కొనేందుకు ప్రజలంతా ఐక్యంగా నిలవాలని, 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని ఐపీ ఎక్స్‌టెన్షన్‌లో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. 'సియావర్ రామచంద్ర కీ జై' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ.. శ్రీరాముడి ఆదర్శాలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. కేవలం రావణుడిని సంహరించినందుకే కాకుండా, మానవాళికి విలువైన జీవన సందేశాలను అందించినందుకే శ్రీరాముడిని మనం ఆరాధిస్తామన్నారు. రాజ్యాధికారం లభిస్తుందన్న ఆనందమైనా, వనవాసానికి వెళ్లాల్సి వచ్చిందన్న బాధైనా ఆయనను ధర్మమార్గం నుంచి తప్పించలేకపోయాయని గుర్తుచేశారు. వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం, సమాన అవకాశాలు కల్పించడం, అధికారం కేవలం ప్రజల సంక్షేమానికే ఉపయోగపడటం రామరాజ్య ప్రధాన లక్షణాలని వివరించారు. గోస్వామి తులసీదాస్ బోధనల ప్రకారం ప్రజలనే దేవుళ్లుగా భావించి (నాగరిక దేవో భవః) సుపరిపాలన సాగించాలని, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేయాలని సూచించారు.

### సొంత సామర్థ్యంపై నమ్మకం ముఖ్యం..

సంక్షోభాలు, సవాళ్లు ఎంత క్లిష్టంగా ఉన్నా ఇతరులపై ఆధారపడకుండా సొంత సామర్థ్యాన్ని విశ్వసించాలని ప్రధాని సూచించారు. సముద్రం అడ్డుగా ఉన్నా, లంక దూరంగా ఉన్నా శ్రీరాముడు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా, ప్రజల సమష్టి శక్తితో అసాధ్యమైన లక్ష్యాన్ని సుసాధ్యం చేశారని గుర్తుచేశారు. ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పమే విజయానికి కీలకమన్నారు. దేశం ముందున్న 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు ప్రజల సమష్టి కృషి ఎంతో అవసరమన్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో రాజకీయ పార్టీలన్నీ భేదాభిప్రాయాలు పక్కనబెట్టి ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించుకోవాలని మోదీ కోరారు. భారతమాత శత్రువులను గుర్తించి ఓడించేందుకు 'రాష్ట్ర ప్రథమ్' భావనతో అడుగులు వేయాలన్నారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ సమయంలో తాను ప్రకటించిన 'రాముడి నుంచి రాష్ట్రం.. దేవుడి నుంచి దేశం' అనే సంకల్పాన్ని తప్పకుండా సాకారం చేస్తామని ప్రధాని ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.

# భారత్‌లో జోక్యం చేసుకోం!

### యూఎన్ వ్యాఖ్యలపై రూబియో స్పందన
### అది భారత్ అంతర్గత వ్యవహారం
### వారిది కేవలం భిన్నాభిప్రాయమే
### దేశీయ రాజకీయాలపై స్పందించను

**వాషింగ్టన్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** భారతదేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళనల అణచివేతపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) నిపుణులు చేసిన వ్యాఖ్యలపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందించారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోబోమని ఆయన తేల్చిచెప్పారు. యూఎన్ నిపుణులు వ్యక్తం చేసిన ఆందోళనను ఆయన తోసిపుచ్చారు. వారిని ఐక్యరాజ్యసమితి నిపుణులుగా పరిగణించలేమని, కేవలం భిన్నమైన అభిప్రాయాలు కలిగిన వ్యక్తులుగా మాత్రమే చూడాలని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు, ఆందోళనలు సహజమైన భాగమేనని ఆయన పేర్కొన్నారు. ఇటీవల భారత్‌లో నిరసనకారుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, ఆందోళనల నియంత్రణపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని 20 మందికి పైగా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నిపుణులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూఎన్ నిపుణుల ఆందోళనల నడుమ ఈ వ్యవహారంపై అమెరికా వైఖరిని రూబియో కుండబద్దలు కొట్టారు.



### శాంతియుత, హింసాత్మక ఆందోళనలకు తేడా ఉంది..

భారతదేశం ఒక బలమైన ప్రజాస్వామ్య దేశమని, అక్కడ క్రమం తప్పకుండా పకడ్బందీగా ఎన్నికలు జరుగుతున్నాయని రూబియో గుర్తుచేశారు. ఆ దేశ అంతర్గత రాజకీయాలపై తాను ఎలాంటి అభిప్రాయాలు వెల్లడించబోనని స్పష్టం చేశారు. అయితే నిరసనల విషయంలో శాంతియుత ఆందోళనలకు, హింసాత్మక ఘటనలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే క్రమంలో యూరప్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ఆయన ప్రస్తావించారు. అమెరికాలో సైతం ప్రతిరోజూ ఏదో ఒక చోట నిరసనలు జరుగుతూనే ఉంటాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలకు స్థానం ఉన్నప్పటికీ.. వాటి స్వరూపాన్ని బట్టి పరిస్థితులను అంచనా వేయాల్సి ఉంటుందని రూబియో స్పష్టం చేశారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక


## సంపాదకీయం



# జైలు గోడల మధ్యే గ్యాంగ్‌స్టర్ బిష్ణోయ్

## కేంద్రం నిబంధనలు అతనికి ఎలా ప్లస్ అవుతున్నాయి?

## పోలీసుల విచారణకు కేంద్రం ఆంక్షలు!

**బిష్ణోయ్‌ను బయటకు తరలించకుండా కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు**

**జైలు ప్రాంగణం, దృశ్యమాధ్యమం ద్వారానే విచారణకు అవకాశం**

**టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనతో మళ్లీ తెరపైకి వివాదం**

**కేంద్రం ఆంక్షలను ఎత్తివేయాలంటూ కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ డిమాండ్**

దేశవ్యాప్తంగా పలు సంచలన నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను నేరుగా విచారించేందుకు ముంబై పోలీసులకు చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్న అతడిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులు దర్యాప్తు సంస్థలకు ప్రధాన అవరోధంగా మారినట్లు సమాచారం. ముంబైలో జరిగిన పలు నేర ఘటనల్లో బిష్ణోయ్ గ్యాంగ్ పేరు వినిపిస్తున్నప్పటికీ అతడిని పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అవకాశం లేకపోవడంపై చర్చ జరుగుతోంది. తాజాగా బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు జరిగినట్లు వచ్చిన వార్తలు, ఆ ఘటనకు బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించినట్లు సామాజిక మాధ్యమాల్లో వెలువడిన ప్రకటనల నేపథ్యంలో ఈ వ్యవహారం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే తాజా ఘటనలో బిష్ణోయ్ లేదా అతడి ముఠా ప్రమేయం దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. కేంద్ర హోంశాఖ 2023 ఆగస్టులో అప్పటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 268 కింద లారెన్స్ బిష్ణోయ్‌ను జైలు నుంచి బయటకు తరలించకుండా ఉత్తర్వులు జారీ చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. భద్రతాపరమైన కారణాలతో ఖైదీని జైలు నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడంపై పరిమితులు విధించేందుకు ఈ నిబంధన అవకాశం కల్పిస్తుంది. కొత్త నేర న్యాయ చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత సంబంధిత నిబంధనల కింద ఆ ఆంక్షలను కొనసాగించినట్లు సమాచారం. ఈ ఉత్తర్వుల కారణంగా బిష్ణోయ్‌ను ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి విచారించే విషయంలో దర్యాప్తు సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా ఒక నేరానికి సంబంధించి జైలులో ఉన్న నిందితుడిని విచారించాల్సి వస్తే దర్యాప్తు సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగిన అనుమతులు పొందుతాయి. అయితే బిష్ణోయ్ విషయంలో జైలు నుంచి తరలింపుపై ప్రత్యేక ఆంక్షలు అమల్లో ఉండటంతో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లే ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో జైలు ప్రాంగణంలోనే విచారణ జరపడం లేదా దృశ్యమాధ్యమం ద్వారా ప్రశ్నించడం వంటి ప్రత్యామ్నాయాలను దర్యాప్తు సంస్థలు ఉపయోగించాల్సి వస్తోంది. అయితే ఈ ఉత్తర్వులు బిష్ణోయ్‌కు నేర విచారణ నుంచి మినహాయింపు కల్పించవని, ప్రధానంగా అతడి తరలింపునకు సంబంధించినవేనని న్యాయపరంగా గుర్తించాల్సి ఉంటుంది. ముంబైలో చోటుచేసుకున్న పలు సంచలన ఘటనల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌పై ఆరోపణలు వినిపించాయి. బాంద్రా వెస్ట్‌లోని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద కాల్పుల ఘటన, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య, దర్శకుడు రోహిత్ శెట్టికి బెదిరింపులు వంటి వ్యవహారాల్లో ఈ ముఠా పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈ కేసుల్లో సంబంధిత నిందితుల పాత్ర, కుట్ర వెనుక ఉన్న వ్యక్తుల ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాయి. అయితే ఒక్కో కేసులో ఆరోపణలు, సేకరించిన ఆధారాలు, న్యాయస్థానాల నిర్ణయాలను వేర్వేరుగా పరిగణించాల్సి ఉంటుంది.

### టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల కలకలం



అక్టోబర్ 18న ముంబైలోని జుహు ప్రాంతంలో బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై ముగ్గురు దుండగులు కాల్పులు జరిపినట్లు సమాచారం వెలువడింది. ఈ ఘటనకు తమదే బాధ్యతంటూ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రకటన వచ్చినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ కేసుకు సంబంధించి అనుమానితులను రాజస్థాన్‌లోని కోటా రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటన ప్రామాణికత, నిందితుల సంబంధాలు, ఘటన వెనుక ఉన్న కుట్రపై అధికారిక దర్యాప్తు వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పలు రాష్ట్రాలకు విస్తరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేర ముఠాల కార్యకలాపాలపై దర్యాప్తు చేయడంలో నిందితుల మధ్య సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, సమాచార మార్పిడి, ఆదేశాలు అందిన విధానం వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. బిష్ణోయ్‌ను నేరుగా పోలీసు కస్టడీలోకి తీసుకోలేకపోవడం వల్ల కుట్ర వెనుక ఉన్న పూర్తి వివరాలను సేకరించడం కష్టమవుతోందని పోలీసు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే జైలు ప్రాంగణంలో విచారణ, దృశ్యమాధ్యమం ద్వారా ప్రశ్నించడం, ఇతర నిందితుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల సేకరణ వంటి దర్యాప్తు మార్గాలు అందుబాటులోనే ఉంటాయి.

### ఛోటా రాజన్‌కూ ఇలాంటి ఆంక్షలే.. ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్

గతంలో అండర్‌వరల్డ్ నేరస్థుడు ఛోటా రాజన్ విషయంలోనూ భద్రతా కారణాలతో జైలు నుంచి తరలింపుపై ప్రత్యేక పరిమితులు అమలు చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ విషయంలోనూ ఇలాంటి ఏర్పాట్లు ఉన్నట్లు సమాచారం. అయితే ఆయా వ్యక్తులపై అమల్లో ఉన్న ఉత్తర్వుల పరిధి, చట్టపరమైన కారణాలు ఒకే విధంగా ఉన్నాయో లేదో సంబంధిత అధికారిక పత్రాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. లారెన్స్ బిష్ణోయ్‌ను జైలు నుంచి తరలించకుండా అమలు చేస్తున్న ఆంక్షలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ సప్కల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కోరినట్లు సమాచారం. ముంబైలో వరుస నేర ఘటనల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలకు అవసరమైన సహకారం అందించాలని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు నేరాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

# మార్కెట్‌పై డ్రోన్ దాడి.. 153 మంది మృతి!

- సూడాన్-దక్షిణ సూడాన్ సరిహద్దులో ఘోర విషాదం
- అబ్యేలోని అమియెట్ మార్కెట్‌పై విరుచుకుపడిన డ్రోన్
- ఇంధన డిపో ధ్వంసం..
- మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముందన్న స్థానిక అధికారులు



**అబ్యే, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** సూడాన్, దక్షిణ సూడాన్ మధ్య వివాదాస్పద సరిహద్దు ప్రాంతమైన అబ్యేలో ఘోర విషాదం చోటుచేసుకుంది. జనసంచారం ఎక్కువగా ఉండే అమియెట్ మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడిలో కనీసం 153 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మార్కెట్ సమీపంలోని ఇంధన డిపో కూడా దాడిలో దెబ్బతినడంతో భారీగా మంటలు చెలరేగాయి. సోమవారం ఉదయం జరిగిన ఈ దాడి అనంతరం మంగళవారం వరకు మంటలు కొనసాగినట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని, పరిస్థితి అత్యంత భయానకంగా ఉందని అబ్యే తాత్కాలిక సమాచార శాఖ మంత్రి యోహన్నా అకోల్ న్గోర్ వెల్లడించారు. ఈ దాడికి సూడాన్ సైన్యమే కారణమని ఆయన ఆరోపించారు. అయితే దాడికి పాల్పడినవారి గుర్తింపు, దాడి వెనుక కారణాలను స్వతంత్రంగా నిర్ధారించలేకపోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. మరోవైపు ఈ ఘటనపై దక్షిణ సూడాన్ ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

### 153 మరణాలు నమోదు చేశాం

అబ్యే పరిపాలన యంత్రాంగం తాత్కాలిక సమాచార శాఖ మంత్రి యోహన్నా అకోల్ న్గోర్ ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 153 మంది మరణించినట్లు నమోదు చేశామని మంగళవారం అసోసియేటెడ్ ప్రెస్‌కు ఫోన్ ద్వారా వెల్లడించారు. మంటలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముందని పేర్కొన్నారు. దాడి జరిగిన ప్రాంతంలో పరిస్థితి భయానకంగా ఉందని వివరించారు. మార్కెట్‌పై జరిగిన ఈ దాడికి సూడాన్ సైన్యమే బాధ్యత వహించాలని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణను స్వతంత్రంగా ధ్రువీకరించే సమాచారం అప్పటికి అందుబాటులోకి రాలేదు. డ్రోన్ దాడిలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్‌గా ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయ వైద్య సహాయ సంస్థ ఎంఎస్ఎఫ్ ప్రకారం, 20 మందికి పైగా క్షతగాత్రులను అమెత్ బెక్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ ఎంఎస్ఎఫ్ వైద్య బృందాలు దక్షిణ సూడాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ సిబ్బందితో కలిసి చికిత్స అందిస్తున్నాయి. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. కాలిన గాయాలతో బాధపడుతున్నవారు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అమెత్ బెక్ ఆసుపత్రిలో ఎంఎస్ఎఫ్ వైద్య కార్యకలాపాల మేనేజర్ డాక్టర్ క్రిస్టియన్ లిండౌర్ ఘటన తీవ్రతను వివరించారు. ఇప్పటివరకు 20 మందికి పైగా క్షతగాత్రులు ఆసుపత్రికి వచ్చారని, వారిలో పలువురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కాలిన గాయాలతో బాధపడుతున్నవారికి కూడా చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రులకు చేరుతున్నవారికి అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దాడి కారణంగా సాధారణ ప్రజలకు వైద్య సేవలు, ఇతర నిత్యావసర సదుపాయాలు అందుబాటులో ఉండటంపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమియెట్ మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడికి సూడాన్ సైన్యమే కారణమని దక్షిణ సూడాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. మార్కెట్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడి జరగడంతో పౌరులు మరణించారని, ఆస్తులకు భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంది. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సూడాన్ రాయబారిని పిలిపించినట్లు వెల్లడించింది. పౌరుల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూడాన్‌ను కోరింది. అబ్యే ప్రాంతానికి సంబంధించిన వివాదాలను సైనిక చర్యల ద్వారా కాకుండా దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. సూడాన్, దక్షిణ సూడాన్ మధ్య అబ్యే ప్రాంతంపై చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. ఇరు దేశాల సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతం భద్రతాపరంగా అత్యంత సున్నితమైనదిగా పరిగణించబడుతోంది. మరోవైపు సూడాన్‌లో 2023 ఏప్రిల్ నుంచి సైన్యం, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం దేశంలోని అనేక ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ ఘర్షణల ప్రభావం సరిహద్దు ప్రాంతాల స్థిరత్వంపైనా పడుతోంది.

# 'పురుషాధిక్య వర్గం'గా ఆర్‌ఎస్‌ఎస్

- మహిళలను పురుషుల ఆస్తిగా చూసే ఆర్‌ఎస్‌ఎస్‌తో నా పోరాటం ఆగదు!
- నేను శివశక్తిని నమ్ముతా.. అందుకే ఆర్‌ఎస్‌ఎస్‌తో పోరాడటం ఆనందం
- ఆర్‌ఎస్‌ఎస్ పురుషాధిక్య భావజాలంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- కేవలం పురుషులతో కూడిన రాజ్యాంగ వ్యతిరేక సంస్థ అంటూ ఆరోపణ





**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పై చేసిన తీవ్ర దాడి రాజకీయ దుమారాన్ని రేపగా, బీజేపీ నుంచి గట్టి ప్రతిస్పందనను ఎదుర్కొంది. మంగళవారం 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పెట్టిన ఒక పోస్ట్‌లో, గాంధీ ఆర్‌ఎస్‌ఎస్‌ను "కేవలం పురుషులతో కూడిన రాజ్యాంగ వ్యతిరేక సంస్థ" అని అభివర్ణించారు. అంతేకాకుండా, ఆ సంస్థ మహిళలను పురుషుల కంటే తక్కువగా చూస్తుందని ఆరోపించారు. "ఆర్‌ఎస్‌ఎస్ అనేది కేవలం పురుషులతో కూడిన, రాజ్యాంగ వ్యతిరేక సంస్థ. మహిళలు పురుషుల ఆస్తి అని అది నమ్ముతుంది," అని ఆయన 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో పోరాడటం తనకు ఆనందాన్నిస్తుందని గాంధీ తెలిపారు. సంఘ్‌కు చెందిన 'సొంత' మహిళలు కూడా చాలామంది తనతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

### 'సొంత' మహిళలు చాలామంది నా పక్షాన ఉన్నారు: రాహుల్

"నేను శివ-శక్తిని నమ్ముతాను. అందుకే వారితో పోరాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. అందమైన విషయం ఏమిటంటే, వారి 'సొంత' మహిళలు చాలామంది నా పక్షాన ఉన్నారు," అని గాంధీ రాశారు. గాంధీ చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడిన మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్, ఆయనకు సరైన అవగాహన లేదని పేర్కొంటూ, ఆర్‌ఎస్‌ఎస్‌లో మహిళా విభాగం కూడా క్రియాశీలంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. "రాహుల్ గాంధీ తరచుగా ఆర్‌ఎస్‌ఎస్ గురించి వ్యాఖ్యలు చేస్తుంటారు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు మరియు తీవ్ర విమర్శలు చేసే హక్కు ఆయనకు ఉన్నప్పటికీ, ఏదైనా మాట్లాడే ముందు ఆయన సరైన అధ్యయనం చేయాలి. ఆర్‌ఎస్‌ఎస్‌లో మహిళల కోసం కూడా ఒక విభాగం ఉందని ఆయనకు తెలియదా? ఇది దేశవ్యాప్తంగా పనిచేస్తోంది; ఇందులో మహిళలు పురుషులతో సమానమైన ప్రాముఖ్యతతో పనిచేస్తున్నారు" అని కదమ్ అన్నారు.

### రాహుల్ గాంధీ వ్యాఖ్యలు పిల్లచేష్టలు: బీజేపీ

ఇలాంటి 'పిల్లచేష్టల' వ్యాఖ్యలు ప్రతిపక్ష నాయకుడికి తగవని ఆయన అన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "మీ సొంత పార్టీలోనే ఎంతమంది మహిళలు కీలక పదవులు పొందారు?" అని ప్రశ్నించారు. "రాహుల్ గాంధీ తన పార్టీ ఎంత పురుషాధిక్యతతో ఉందో మరిచిపోతున్నట్లుంది. వారు ఎక్కడ అధికారంలో ఉన్నా, అక్కడ ఎంతమంది మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారో సమాధానం చెప్పాలి. రాజధానిలో బీజేపీకి ఒక మహిళా ముఖ్యమంత్రి ఉన్నారు," అని రావు ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి హెచ్చరిక ఆయన మహిళా రిజర్వేషన్ల అంశాన్ని కూడా లేవనెత్తి, దానిని కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆరోపించారు.

# టైగర్ ష్రాఫ్ కాదు.. అసలు టార్గెట్ సల్మాన్!

- బాలీవుడ్ కాల్పుల కేసులో సంచలన మలుపు
- గుజరాత్‌లో మరో నిందితుడి అరెస్టు



**ముంబై, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఉదంతం మరో మలుపు తిరిగింది. తాము మొదట నటుడు సల్మాన్ ఖాన్‌ను టార్గెట్ చేశామని నిందితులు పోలీసులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కేసుకు సంబంధించి హర్యానాకు చెందిన ఇద్దరు షూటర్లను, బిహార్‌కు చెందిన మరొకరిని రాజస్థాన్‌లో పోలీసులు అరెస్టు చేసి ముంబైకి తరలించారు. అంతేకాకుండా, హర్యానాకు చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు షూటర్లకు ఆయుధాలను సరఫరా చేసినట్టు తెలుస్తోంది. విచారణ సమయంలో నిందితులు కునాల్ అనే వ్యక్తి గురించి చెప్పడంతో అతడినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీడియా కథనాల ప్రకారం.. ముగ్గురు షూటర్లు మొదట నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. అయితే, సల్మాన్ ఇంటి ముందు పోలీసు బందోబస్తు పటిష్ఠంగా ఉండటంతో వెనక్కు తగ్గారు. మరో సులువైన టార్గెట్ కోసం వెతుకుతుండగా వారి దృష్టి టైగర్ ష్రాఫ్‌పై పడింది. ప్రతి ఆదివారం ఆయన జుహూ ప్రాంతంలోని ఫుట్ బాల్ గ్రౌండ్‌కు వస్తారని అభిమానుల ఫేస్‌బుక్ పేజీ ద్వారా తెలుసుకున్నారు. అక్కడ భద్రత కూడా తక్కువగా టుందని గ్రహించి ఆదివారం సాయంత్రం టైగర్ ష్రాఫ్‌ను టార్గెట్ చేశారు.

### చెప్పినా వినలేదు.. అందుకే..

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు తామే బాధ్యులమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిట్, హర్మన్ సంధూ ప్రకటించారు. సల్మాన్‌తో పని చేసిన వారందరూ తమ టార్గెట్ అని వార్నింగ్ ఇచ్చారు. టైగర్ ష్రాఫ్‌కు అంతకుముందే కాల్ చేసి హెచ్చరించినా వినిపించుకోలేదని చెప్పారు. దీంతో, విషయం అర్థమయ్యేలా మరోసారి చెప్పామని వ్యాఖ్యానించారు.

### మరో వ్యక్తి అరెస్టు

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనకు సంబంధించిన కేసులో ముంబై పోలీసులు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. అతడిని గుజరాత్‌లోని బరోడాలో అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని అంకిత్‌గా గుర్తించారు. అతడిని అరెస్టు చేసిన తర్వాత హర్యానాలోని గోహానా కోర్టులో హాజరుపరిచారు. తర్వాత ట్రాన్సిట్ రిమాండ్‌పై ముంబైకి తరలించారు. గోహానా పోలీసులు, ముంబై పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి అంకిత్‌ను అరెస్టు చేశారు.

### లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలపై ఆరా

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు సన్నిహితుడిగా పేరున్న అనిల్ పండిట్‌తో అంకిత్‌కు సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కాల్పుల ఘటనకు సంబంధించిన కుట్రలో అంకిత్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంకిత్, నేపాల్, అనిల్ పండిట్‌ల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు కూడా దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ లావాదేవీల వెనుక ఉన్న కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌తో అంకిత్‌కు ఉన్న సంబంధాలు, కుట్రలో అతడి పాత్రపై మరింత లోతుగా విచారణ జరపనున్నారు.

### కోటా నుంచి ముంబైకి ముగ్గురు నిందితులు

టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనలో కీలక నిందితులుగా భావిస్తున్న ముగ్గురిని బుధవారం రాజస్థాన్‌లోని కోటా నుంచి ముంబైకి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. కోటా నుంచి రోడ్డు మార్గంలో ముంబైకి తరలించిన అనంతరం వైద్య పరీక్షల కోసం వారిని జీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయ్యాక విచారణ కోసం ముంబై క్రైమ్ బ్రాంచ్‌లోని యాంటీ ఎక్స్‌టార్షన్ సెల్ (ఏఈసీ) కార్యాలయానికి తరలించారు. కాగా.. నిందితులను హర్యానాలోని సోనిపట్‌కు చెందిన రెహాన్ అలియాస్ సుక్కా, బిహార్‌లోని బెగుసరాయ్‌కు చెందిన రితిక్ కుర్మీ అలియాస్ రోషన్, హర్యానాకు చెందిన ఫూల్ సింగ్‌గా గుర్తించారు. కోటా నగర పోలీసులు వీరిని ముంబై పోలీసులకు అప్పగించగా, ముంబై పోలీసులు అధికారికంగా అరెస్టు చేసి స్థానిక మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నిందితులను ముంబైకి తరలించేందుకు కోర్టు ట్రాన్సిట్ రిమాండ్ మంజూరు చేసింది. మరోవైపు నిందితుల తరఫున వాదనలు వినిపించేందుకు అజింక్య మిర్గల్ అనే అడ్వొకేట్ బుధవారం ఉదయం ఏఈసీ కార్యాలయానికి చేరుకున్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# వైభవంగా విజయదశమి వేడుకలు

**కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో రమణీయంగా శమి పూజ, రావణ దహనం ■ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సాంస్కృతిక ప్రదర్శనలు**





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** పట్టణంలో విజయదశమి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంబరాన్నంటే సంబరాలతో వైభవంగా జరిగాయి. స్థానిక కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకల కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ వేడుకల్లో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు విరివిగా పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరుల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ శమి వృక్ష (జమ్మి) పూజను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు ఒకరికొకరు జమ్మి పత్రాలను పంచుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రావణ దహన కార్యక్రమానికి ముందు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రా ద్వారా శ్రీరామచంద్రుని పాత్రకు స్థానిక వ్యాపారి తాటిపల్లి వినాయకరావు ఎంపికయ్యారు. అతిథులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కిరీట ధారణ చేయించి, ధనస్సును అందించారు. అనంతరం శాలువా కప్పి, శ్రీ ఆంజనేయస్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వైభవంగా రావణ దహన ఘట్టాన్ని ఆవిష్కరించారు. విజయదశమి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ప్రముఖ మ్యూజిషియన్, మిమిక్రీ కళాకారుడు గిరీష్, గాయకులు శేఖర్, భవాని తమ అద్భుత ప్రదర్శనలతో, భక్తి గీతాలు మరియు మిమిక్రీ విన్యాసాలతో సభను ఆకట్టుకున్నారు.

### ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వేడుకల్లో పాల్గొన్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని పేర్కొన్నారు. విజయదశమి పండగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీరా శ్యాంనాయక్ , భాజపా రాష్ట్ర నాయకులు, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు అరిగెల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఇరుకుల్ల మంగ , మున్సిపల్ చైర్మన్ మెంగ్రె ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ , బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మర్సుకోల సరస్వతి , మాజీ ఏఎంసీ చైర్మన్లు గాడివేని మల్లేష్, గంధం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్ , మున్సిపల్ కౌన్సిలర్లు చిలువూరు వెంకన్న, బాలకృష్ణ, సర్పంచులు సంగీత లచ్చన్న, పోచయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొనగిరి సతీష్ బాబు, భాజపా రాష్ట్ర నాయకురాలు ఎస్.ఎన్. సుహాసిని, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్ నర్ రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండ వెంకటేశ్వర్, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రతినిధులు ఎకిరాల శ్రీనివాస్, గడ్డం వెంకన్న, వనం మధు, లక్ష్మణమూర్తి, అశోక్, శంకర్, సుధాకర్ పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# అనుమతి లేని ఫిల్మ్ సిటీకి నోటీసులు

**'ఉద్యమ కెరటం' కథనానికి స్పందన**

**దిగివచ్చిన పంచాయితీ అధికారులు**

**హాట్ టాపిక్ మారిన ఫిల్మ్ సిటీ వ్యవహారం**

ఉద్యమ కెరటం,కరీంనగర్:

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఖాదర్ గూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా 12 ఎకరాల్లో నిర్మించిన ప్రైవేటు ఫిల్మ్ సిటీ వ్యవహారంలో చివరకు పంచాయితీ అధికారులు కదిలారు.ఇటీవల "ఉద్యమ కెరటం"దినపత్రికలో ఫిల్మ్ సిటీకి ఎలాంటి పంచాయితీ అనుమతులు లేవని,భారీగా అక్రమ నిర్మాణాలు చేశారని,పంచాయితీ ఆదాయానికి గండి కొడుతున్నారని "ఫిల్మ్ సిటీ యాజమాన్యం ఇష్టారాజ్యం"అనే కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే.ఫిల్మ్ సిటీలోని టెంపుల్ సెట్ ఫోటోతో సహా కథనాలు రావడంతో

ఉద్యమ కెరటం
ఎఫెక్ట్
కథనానికి స్పందన



వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఈ కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు వెంటనే ఫిల్మ్ సిటీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా చేశారు? సుడా అనుమతులు ఉన్నాయా? అంటూ నోటీసుల్లో ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సంబంధిత పత్రాలతో పంచాయితీ కార్యాలయానికి హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. పత్రికల్లో కథనాలు వచ్చే వరకు నిద్రపోయిన అధికారులు,ఇప్పుడు నోటీసులతో సరిపెడతారా? లేక చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.నోటీసులకే పరిమితమైతే మామూళ్ల మత్తులో పడ్డారని భావించాల్సి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు.ఈ నోటీసులపై ఫిల్మ్ సిటీ యాజమాన్యం ఎలా స్పందిస్తుందో,అధికారులు తదుపరి చర్యలు ఏం తీసుకుంటారోనని గ్రామంలో ఆసక్తికరంగా మారింది.

# అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**



**అశోక ధమ్మ చక్ర పరివర్తన్ దివస్ పోస్టర్ల ఆవిష్కరణ**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** 2570 అశోక ధమ్మ చక్ర పరివర్తన్ దివస్ ఈనెల 29 నాడు జిల్లా కేంద్రంలోని లుంబినిదీక్ష భూమిలో నిర్వహిస్తున్నట్లు , అశోక ధర్మ చక్ర పరివర్తన్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెంటర్ కమిటీ, లుంబిని దీక్ష భూమి కమిటీ నాయకులతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ కోరారు. ఈ కార్యక్రమంలో అసిఫాబాద్ సెంటర్ కమిటీ అధ్యక్షుడు మసడే ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, సంతోష్, కోశాధికారి దుర్గం అనిల్, సభ్యులు కాట్కార్ గౌతమ్, అజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక కళాకారులను, రచయితలను**

# ప్రోత్సహిస్తాం

**ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** స్థానిక కవులను, రచయితలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఉత్తర నదీ తీరాన వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ చిలుకూరి రాధాకృష్ణ చారి రచించిన తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతా చారి పై రూపొందించిన శక్తివంతమైన ఉద్యమ గీతాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాధాకృష్ణ చారి లాంటి ప్రతిభావంతులు మరిన్ని రచనలు చేసి ఆసిఫాబాద్ జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆరిగేల నాగేశ్వరరావు, అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ , ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ , సర్పంచ్ బుర్సా పోచయ్య , బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సకుల సరస్వతి, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పిన్నా వివేక్, ఏకిరాల శ్రీనివాస్, వనం మధు, గడ్డల వెంకటేష్, సాయిని లక్ష్మణమూర్తి, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### లిరాధాకృష్ణ చారి సాహిత్య ప్రస్థానంలి

ఆసిఫాబాద్ ప్రాంతానికి చెందిన చిలుకూరి రాధాకృష్ణ చారి కేవలం జర్నలిస్టుగానే కాకుండా, ఉత్తమ కవిగా, రచయితగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో స్ఫూర్తిదాయక గేయాలు, పద్యాలు రాసి ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. సామాజిక అంశాలపై ఆయన రాస్తున్న రచనలు సాహిత్య లోకపు ప్రశంసలను అందుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఉద్యమ కెరటం తెలుగు దినపత్రిక ఎడిటర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ రాధాకృష్ణ చారి ను అభినందించారు.

# అసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వినోదానికి కొత్త శోభ

**జిల్లా కలెక్టర్ కె.హరిత**






**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ప్రజలకు ఆహ్లాదకరమైన వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో పిక్చర్ టైమ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమన్వయంతో గాలి బుడగల నిర్మాణంతో రూపొందించిన ఆధునిక సినిమా థియేటర్‌ను పునః ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గాలి బుడగల థియేటర్ ప్రారంభించడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన వినోద సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, మహిళా సంఘాల సహకారం, సమన్వయంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. పిక్చర్ టైమ్ సినిమా థియేటర్‌లో పుష్‌బ్యాక్ సీట్లు, ఎయిర్ కండిషనింగ్, డాల్బీ సౌండ్ వంటి ఆధునిక సదుపాయాలతో పాటు ఆహార పదార్థాలు, పానీయాలు అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు, యువత, కుటుంబాలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలకు వినోదంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం సానుకూల పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

**రైతులు నాణ్యమైన పత్తిని తీసుకురావాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 2026–27 పత్తి సీజన్కు సంబంధించి పత్తి కొనుగోళ్లు గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సీసీఐతో పాటు ప్రైవేటు వ్యాపారుల ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పత్తిని విక్రయించుకునేలా నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. పత్తి విక్రయానికి ముందుగా 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పత్తి నాణ్యత, తేమ తదితర అంశాల్లో రైతులు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, పత్తి వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, మార్కెట్ కమిటీ అధికారులు, హాజరుకావాలని కోరారు.

# అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం





**జిల్లా ఎస్పీ నితికా పంత్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం"లో ఆమె పాల్గొని అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1985 నుంచి జిల్లా పరిధిలో 14 మంది పోలీసులు శాంతిభద్రతల కోసం ప్రాణత్యాగం చేశారని స్మరించుకున్నారు. అమరుల కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అక్టోబర్ 22 నుంచి వ్యాసరచన, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి. అశోక్, వాహిదుద్దిన్, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎంజేజేబీవై బీమాతో కుటుంబాలకు ఆర్థిక భరోసా

**ఎస్బీఐ మేనేజర్ రోహిత్**



**ఉద్యమ కెరటం, జైనూర్:** కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా బీమా పథకాలు అండగా నిలుస్తాయని, ప్రతిఒక్కరూ జీవిత బీమా పొందాలని జైనూర్ ఎస్బీఐ మేనేజర్ రోహిత్ సూచించారు. బీమా పథకాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకొని కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని కోరారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో మండలానికి చెందిన గోదమలే ప్రకాష్, అడే జీవన్కు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకం కింద రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుకోని పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంలో జీవిత బీమా కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఖాతాదారులు తమకు అందుబాటులో ఉన్న బీమా పథకాల వివరాలను బ్యాంక్ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐ క్రాంతి రేఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్ జనార్దన్, ఐకేపీ ఏపీఎం శ్రీకాంత్, జైనూర్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ చంద్రశేఖర్, ఎన్జీహెచ్ఆర్ఏ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి జంగు వికాస్, గిరే సుధాం తదితరులు పాల్గొన్నారు.

# అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం



**ఉద్యమ కెరటం, మేడ్చల్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జవహర్నగర్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, స్థానికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులతో కాలనీవాసులకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, సీనియర్ నాయకులు రజిత గోపాల్, నర్ర మహేష్, భాస్కర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, మైనారిటీ అధ్యక్షుడు ఎండీ గౌస్, స్థానికులు బషీర్, షఫీ, శ్రీరామ్, నాగరాజు, శ్రీనివాస్, స్రవంతి, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విజయదశమి వేడుకలు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ పట్టణ కేంద్రంలోని సార్వజనిక్ దుర్గామాత మండలి ఆధ్వర్యంలో విజయదశమి (దసరా) వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలి నిర్వాహకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండలి సభ్యులు, స్థానిక యువకులు, పెద్దలు తరలివచ్చి దుర్గామాతకు పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు జమ్మి ఆకులు ఇచ్చుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దల ఆశీస్సులు తీసుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సార్వజనిక్ దుర్గామాత మండలి సభ్యులు, గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కరువు కోరలు

- ఎండిపోతున్న పంటలు
- ఎలినినో ప్రభావంతో వర్షా భావ పరిస్థితులు
- ఆకాశాన్నంటుతున్న బియ్యం ధరలు
- వేంసూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎలినినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేపట్టిన రైతులకు వర్షాలు లేకపోవడం తీవ్ర నష్టాన్ని మిగిల్చే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఖమ్మం జిల్లా వేంసూర్ మండలంలో వ్యవసాయ పరిస్థితులపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

**పంట చేతికి రాకముందే ధరల భారం..**

ఒకవైపు పంటలు ఎండిపోతుండగా, మరోవైపు బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధాన్యం పంట చేతికి రాకముందే క్వింటాల్ ధర రూ.4,000కు చేరుతుండగా, కొన్నిరకాల బియ్యం కిలో ధర రూ.100 దాటుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న పేద, మ ధ్యత ర గ తికుటుంబాల పై మరింత ఆర్థిక భారం పడుతోంది.



**కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్..**

వేంసూర్ మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల ఎండిపోవడం, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి, వర్షాభావ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వేంసూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, అర్హులైన రైతులకు నష్టపరిహారం, పంటల బీమా, ఇతర ప్రభుత్వ సహాయాన్ని అందించాలని కోరుతున్నారు. రైతులను ఆదుకోవడంతో పాటు బియ్యం ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# భువనేశ్వర్ రీఎంట్రీకి కారణం అదే!

## అసలు విషయం బయటపెట్టిన శ్రేయస్..!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ సుదీర్ఘ విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి అడుగుపెట్టాడు. సరిగ్గా నాలుగేళ్ల తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన భువీ, న్యూజిలాండ్‌తో జరగనున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఎంపికయ్యాడు. అంతకుముందు బెంగళూరు వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన చివరి టీ20లో అవకాశం లభించినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. దీంతో కివీస్‌తో జరిగే తొలి టీ20తోనే అతడి అసలైన రీఎంట్రీ ఉండనుంది. భువనేశ్వర్‌ను తిరిగి జట్టులోకి ఎంపిక చేయడానికి గల అసలు కారణాలను టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తాజాగా మీడియాతో పంచుకున్నాడు. గత కొంతకాలంగా భారత బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞులైన ఆటగాళ్ల కొరత వేధించిందని, భువీ రాకతో ఆ లోటు పూర్తిగా భర్తీ అవుతుందని అయ్యర్ స్పష్టం చేశాడు. "మా జట్టులో చాలా మంది యువ పేసర్లు ఉన్నారు. అయితే పవర్‌ప్లేలో, డెత్ ఓవర్లలో ప్రత్యర్థిపై ఎలా ఆధిపత్యం చెలాయించాలనే అనుభవం భువనేశ్వర్‌కు మెండుగా ఉంది. గత రెండు ఐపీఎల్ సీజన్లలో అతను అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. అందుకే పేస్ విభాగానికి అనుభవం అవసరమనే ఉద్దేశంతోనే అతన్ని ఎంపిక చేశాం" అని శ్రేయస్ అయ్యర్ కొనియాడారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ గతంలో ఫామ్ కోల్పోవడంతో పాటు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించే క్రమంలో జట్టుకు దూరమయ్యాడు. అయితే దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో తన నిలకడైన ప్రదర్శనను కొనసాగించి మళ్లీ సెలక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. ప్రస్తుత న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేసిన జట్టులో నలుగురు స్పెషలిస్ట్ పేసర్లు, ఇద్దరు పేస్ ఆల్‌రౌండర్లు ఉన్నప్పటికీ.. కొత్త బంతితో స్వింగ్ రాబట్టడంలో సిద్ధహస్తుడైన భువీ ప్రదర్శనపైనే అందరి దృష్టి నిలిచింది. ఈ సిరీస్‌లో భువనేశ్వర్ రాణించడం ద్వారా తన అంతర్జాతీయ కెరీర్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉంది.

# 18 ఏళ్ల రికార్డు బద్దలు

## బౌలర్‌గా వచ్చి బ్యాటింగ్‌లో అదరగొట్టిన సైమన్ హార్మర్!

**గెబార్హా, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** కొన్నిసార్లు కేవలం బౌలింగ్ చేయాల్సిన వారే బ్యాట్‌తో విధ్వంసం సృష్టిస్తుంటారు. సరిగ్గా అలాంటి అద్భుతమే ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో చోటుచేసుకుంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ బ్యాటింగ్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. ఏకంగా 18 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గెబార్హాలోని సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో హార్మర్ 82 పరుగులు చేసి డేల్ స్టెయిన్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. తొలి టెస్టులో విజయం సాధించిన ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యంలో కొనసాగుతుండగా, రెండో టెస్టులో సఫారీలు అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను రంజుగా మార్చారు. మ్యాచ్ మూడో రోజు సైమన్ హార్మర్ కేవలం 91 బంతుల్లోనే 10 ఫోర్లు, 1 సిక్సర్‌తో ఉప్పొంగిపోయి 82 పరుగులు సాధించాడు. టెస్టుల్లో ఆస్ట్రేలియాపై 9వ స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నిలిచింది. గతంలో 2008 మెల్‌బోర్న్ టెస్టులో డేల్ స్టెయిన్ చేసిన 76 పరుగులే అత్యధికంగా ఉండేది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 110 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ తరుణంలో కెప్టెన్ టెంబా బవుమా, మార్కో జాన్సెన్ (85) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సైమన్ హార్మర్.. కెప్టెన్ బవుమాతో కలిసి ఎనిమిదో వికెట్‌కు అద్భుతమైన 183 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దక్షిణాఫ్రికా టెస్టు చరిత్రలో ఎనిమిదో వికెట్ లేదా అంతకంటే దిగువన నమోదైన అత్యుత్తమ భాగస్వామ్యాల్లో ఇది రెండోది కావడం విశేషం.

### కెప్టెన్ బవుమా మారథాన్ ఇన్నింగ్స్:

మరోవైపు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా అన్ని ఒత్తిళ్లను ఎదుర్కొంటూ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 334 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్సర్‌తో ఏకంగా 179 పరుగులు సాధించాడు. తొలి రోజు స్వల్ప స్కోరుకే వికెట్లు కోల్పోయిన దశలో బాధ్యతాయుత ఆటతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. సెంచరీ దిశగా సాగిన హార్మర్.. లబుషేన్ బౌలింగ్‌లో ఔట్ కాగా, అనంతరం బవుమా కూడా పెవిలియన్ చేరడంతో దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌ను 425/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 1 వికెట్ కోల్పోయి 3 పరుగులు చేసింది. సఫారీ పేసర్ కగిసో రబాడా నిక్ మ్యాడిన్సన్‌ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఈ మ్యాచ్‌లో సఫారీ ఆటగాళ్ల పోరుతో టెస్టు సిరీస్ మరింత రసవత్తరంగా మారింది.



# భారత్ ఖాతాలో 54 పతకాలు!

## పారా ఆసియా క్రీడల్లో పతకాల పంట..

- 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్యాలతో భారత అథ్లెట్ల జోరు
- 100, 200 మీటర్ల పరుగులో రెండు స్వర్ణాలు సాధించిన సిమ్రాన్
- పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో దిలీప్‌కు పసిడి
- 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతుకు రజతం
- పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్న భారత్





**జపాన్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జపాన్ వేదికగా జరుగుతున్న పోటీల్లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధిస్తూ సత్తా చాటుతున్నారు. తాజాగా భారత పారా అథ్లెట్ సిమ్రాన్ మరో స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల టీ12 విభాగం 100 మీటర్ల పరుగులో విజేతగా నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులోనూ స్వర్ణం సాధించిన సిమ్రాన్ వరుసగా రెండు పసిడి పతకాలు గెలుచుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు పురుషుల టీ47 విభాగంలో దిలీప్ స్వర్ణం సాధించగా, 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని అందుకున్నాడు. దీంతో భారత పతకాల సంఖ్య 54కు చేరుకుంది.

### రెండు స్వర్ణాలతో మెరిసిన సిమ్రాన్

పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ సిమ్రాన్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల టీ12 విభాగంలో 100 మీటర్ల పరుగులో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి స్వర్ణ పతకాన్ని సాధించింది. అంతకుముందు మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులోనూ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఒకే క్రీడా పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి భారత పతకాల సంఖ్యను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. రెండు విభిన్న దూరాల పరుగుల్లో విజేతగా నిలిచి తన ప్రతిభను చాటుకుంది.

### దిలీప్‌కు పసిడి.. భారత్‌కు మరో స్వర్ణం

పురుషుల టీ47 విభాగం 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత అథ్లెట్ దిలీప్ సత్తా చాటాడు. వేగవంతమైన పరుగుతో ప్రత్యర్థులను అధిగమించి స్వర్ణ పతకాన్ని సాధించాడు. కీలకమైన స్ప్రింట్ విభాగంలో దిలీప్ విజయం భారత పతకాల ఖాతాలో మరో పసిడిని చేర్చింది. పురుషుల అథ్లెటిక్స్ విభాగంలో భారత క్రీడాకారుల ప్రతిభకు ఈ విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

### అకీరా నందన్ బానోతుకు రజతం

పురుషుల 400 మీటర్ల టీ35/38 విభాగంలో భారత అథ్లెట్ అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని సాధించాడు. నిర్ణీత దూరాన్ని 51.25 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. స్వర్ణ పతకం చేజారినప్పటికీ రజతంతో భారత పతకాల సంఖ్యను మరింత పెంచాడు. భారత అథ్లెట్లు స్ప్రింట్‌తోపాటు ఇతర పరుగుల విభాగాల్లోనూ పతకాలు సాధిస్తూ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

### 54 పతకాలతో నాలుగో స్థానంలో భారత్

తాజా ఫలితాలతో భారత పతకాల సంఖ్య 54కు చేరుకుంది. ఇందులో 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు పతకాల సంఖ్య పెరగడానికి దోహదపడుతున్నాయి. ముఖ్యంగా సిమ్రాన్ రెండు స్వర్ణాలు సాధించడం, దిలీప్ పసిడి గెలవడం, అకీరా నందన్ బానోతు రజతం అందుకోవడం భారత బృందానికి కీలక విజయాలుగా నిలిచాయి.

### పతకాల వేటలో భారత అథ్లెట్ల సత్తా

జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు తమ పట్టుదల, ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. శారీరక సవాళ్లను అధిగమిస్తూ అంతర్జాతీయ వేదికపై దేశానికి పతకాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు సాధించిన 54 పతకాలతో భారత్ పతకాల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలవడం విశేషం. రానున్న పోటీల్లోనూ భారత అథ్లెట్లు ఇదే జోరు కొనసాగిస్తే పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

# జింబాబ్వేపై భారత్ ఘన విజయం

## 3-0తో సిరీస్ క్లీన్ స్వీప్!



**రాయ్‌పూర్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** రాయ్‌పూర్ వేదికగా జింబాబ్వే మహిళలతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 92 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 124 పరుగులకే పరిమితమైంది. భారత భారీ స్కోరు చేయడంలో సీనియర్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్, విధ్వంసకర ఓపెనర్ షఫాలీ వర్మ కీలక పాత్ర పోషించారు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 41 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 91 పరుగులు సాధించింది. మరోవైపు షఫాలీ వర్మ 37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి రాణించింది.

### స్మృతి మంధాన రికార్డు బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్:

ఈ మ్యాచ్‌లో అజేయంగా 91 పరుగులు చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డు సృష్టించింది. భారత గడ్డపై మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత బ్యాటర్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు స్మృతి మంధాన పేరిట ఉండేది. 2025 డిసెంబర్ 28న తిరువనంతపురంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో మంధాన 48 బంతుల్లో 80 పరుగులు చేయగా, తాజాగా ఆ రికార్డును హర్మన్‌ప్రీత్ అధిగమించింది.

### బౌలింగ్‌లో రాణించిన నందని శర్మ:

భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన జింబాబ్వేకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెలిస్ న్డ్లోవు ఖాతా తెరవకుండానే తొలి బంతికే ఔటైంది. షార్నే మేయర్స్ (60) పోరాడినప్పటికీ, భారత బౌలర్ల విజృంభణ ముందు నిలవలేకపోయారు. భారత బౌలర్లలో నందని శర్మ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టింది. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి చెరో వికెట్ తీశారు. జింబాబ్వే తరఫున కెలిస్ న్డ్లోవు టీ20ల్లో అత్యధిక డకౌట్ల (9) రికార్డు నమోదు చేయగా, షార్నే మేయర్స్ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాది రికార్డు సృష్టించింది. ఈ సిరీస్ విజయంతో భారత జట్టు నూతన జోరును ప్రదర్శించింది.

# ప్రపంచకప్ వేటకు యువ భారత్ సిద్ధం.. తొలి పోరు వెస్టిండీస్‌తో!

## మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ 2027 షెడ్యూల్ విడుదల




**ఖాట్మండు/ఢాకా, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** మహిళా క్రికెట్‌లో యువ ప్రతిభను వెలికితీసే ఐసీసీ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ 2027 షెడ్యూల్, గ్రూపుల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారికంగా విడుదల చేసింది. ఈసారిన ఈ మెగా టోర్నీకి బంగ్లాదేశ్, నేపాల్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జనవరి 21 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ టోర్నీలో పాల్గొంటున్న 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు.

**గ్రూప్ ఏ: భారత్, ఐర్లాండ్, వెస్టిండీస్, నేపాల్**

**గ్రూప్ బీ: దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్థాన్, సమోవా**

**గ్రూప్ సీ: ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నైజీరియా, యూఏఈ**

**గ్రూప్ డీ: ఇంగ్లండ్, శ్రీలంక, అమెరికా, స్కాట్లాండ్**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు గ్రూప్-ఏలో చోటు దక్కించుకుంది. ఆతిథ్య నేపాల్ జట్టు కూడా ఇదే గ్రూప్‌లో ఉండటం విశేషం. భారత్ తొలి మ్యాచ్ ఎవరితోనంటే? డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న భారత అండర్-19 మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో జనవరి 22న వెస్టిండీస్‌తో తలపడనుంది. ఇక జనవరి 21న జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్, యూఏఈ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. టోర్నీ ఫార్మాట్ & వేదికలు:బంగ్లాదేశ్ (చట్టోగ్రామ్, సిల్హెట్), నేపాల్ (ఖాట్మండు) దేశాల్లోని నాలుగు ప్రధాన స్టేడియాలలో ఈ టోర్నీ మ్యాచ్‌లు జరగనున్నాయి. జనవరి 26 వరకు గ్రూప్ దశ మ్యాచ్‌లు ముగుస్తాయి. ఆ తర్వాత సూపర్ సిక్స్ దశ, ఫిబ్రవరి 4న సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. టోర్నీలో అసలు సిసలైన ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 6న జరగనుండగా, వర్షం లాంటి అవాంతరాలు ఎదురైతే మ్యాచ్ నిర్వహణ కోసం ఫిబ్రవరి 7ను రిజర్వ్ డేగా కేటాయించారు.

# ఆ విషయంలో ఇప్పటికీ సందేహమే!



## ఆసక్తికర విషయాలు వెల్లడించిన మమితా బైజు!

**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** ఈ ఏడాది వరుస హిట్ సినిమాలతో జోరు మీదున్నారు మలయాళ కథానాయిక మమితా బైజు. ప్రస్తుతం అగ్ర కథానాయకుల సరసన నటిస్తూ ఆఫర్లు అందుకుంటున్న ఈమె, 'బెత్లెహోం కుటుంబ యూనిట్' చిత్రం గురించి ఇటీవలే ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మమితా మాట్లాడుతూ.. "సూపర్ శరణ్య సినిమా షూటింగ్ అప్పుడే ముగిసింది. ఇంకా ఆ సినిమా విడుదల కూడా కాకముందే దర్శకుడు గిరీశ్ నాకు బెత్లెహోమ్ కుటుంబ యూనిట్ కథ చెప్పారు. ఆ సినిమాలో ఉన్న ప్రత్యేక పాత్రను నేను చేస్తేనే బాగుంటుందని ఆయన అన్నారు. అయితే ఆయన నాతో ఎందుకలా అన్నారో, నన్ను నమ్మడానికి ఆయనకు అంత ధైర్యం ఎలా వచ్చిందో నాకు ఇప్పటికీ తెలియదు. ఈ విషయంలో నాకు ఇప్పటికీ పెద్ద సందేహంగానే ఉంది" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. "ప్రధాన కథానాయిక పాత్రను నేను పూర్తి స్థాయిలో చేయగలనని నేను కూడా నమ్మని సమయంలో దర్శకుడు గిరీశ్ నాపై ఎంతగానో నమ్మకం ఉంచారు. 'ప్రేమలు', 'బెత్లెహోమ్ కుటుంబ యూనిట్' చిత్రాల్లో నాకు మంచి అవకాశాలు ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు" అని మమితా బైజు కృతజ్ఞతలు చెప్పుకొచ్చారు.




# ఏంటి మౌళి.. పబ్లిక్‌గా టిఫిన్ చేసేస్తున్నావ్..!

## 'దొంగ నా కొడుకు' టీజర్ విడుదల!

**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** యూట్యూబర్‌గా విశేష ప్రజాదరణ పొంది, 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో కథానాయకుడిగా మారి భారీ విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా చిత్రం 'దొంగ నా కొడుకు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పూర్తిస్థాయి క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో మౌళి 'ఈశ్వర్' అనే యువకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఏ పనీపాట లేకుండా ఖాళీగా తిరిగే ఈశ్వర్‌కు ఇంట్లో కూడా ఎలాంటి గౌరవం దక్కదు. అలాంటి ఈశ్వర్ జీవితంలోకి ఒక గర్ల్‌ఫ్రెండ్ రావడంతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. ఊహించని విధంగా అతడి చేతికి భారీగా డబ్బు రావడం, ఆ తర్వాత ఎదురైన విచిత్ర పరిస్థితులు, సమస్యల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఈ టీజర్‌లో మౌళి తనదైన బాడీ లాంగ్వేజ్, ఫన్నీ మేనరిజమ్స్, టైమింగ్ కామెడీతో నవ్వులు పూయించాడు. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్‌కు పూర్తి న్యాయం చేస్తూ క్రైమ్, కామెడీ అంశాలను దర్శకుడు శ్రీను కంబాల చక్కగా మేళవించినట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో మౌళికి జోడీగా సుస్మితా శెట్టి నటిస్తుండగా, సీనియర్ నటులు అలీ, రఘుబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంతో ఉత్సాహాన్ని నింపిన ఈ 'దొంగ నా కొడుకు' చిత్రం వచ్చే నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# రెండో ఇన్నింగ్స్‌లో వైపు

## రూటు మార్చిన 'కాజల్ అగర్వాల్..



**హైదరాబాద్, అక్టోబర్ 21 (ఉద్యమ కెరటం):** టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోల సరసన వరుస బ్లాక్‌బస్టర్లతో అగ్ర కథానాయికగా చక్రం తిప్పిన 'చందమామ' కాజల్ అగర్వాల్, తన కెరీర్ రెండో ఇన్నింగ్స్‌లో సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. వివాహం, మాతృత్వం తర్వాత వెండితెరకు కొంతకాలం విరామం ఇచ్చిన ఈ సౌత్ బ్యూటీ, రీఎంట్రీలో మాత్రం కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథానాయికగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో అలరించిన కాజల్, సెకండ్ ఇన్నింగ్స్‌లో కంటెంట్ ఆధారిత సినిమాలకు, లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్టులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. 'సత్యభామ' వంటి యాక్షన్ థ్రిల్లర్ చిత్రాల్లో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషించి నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ చేయగలనని నిరూపించుకున్నారు. రెగ్యులర్ హీరోయిన్ పాత్రల కంటే నటిగా గుర్తింపు తెచ్చే వైవిధ్యమైన కథలనే ఎంచుకుంటూ పయనిస్తున్నారు. కేవలం ఒక్క భాషకే పరిమితం కాకుండా పాన్-ఇండియా స్థాయిలో కూడా కాజల్ తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో పాటు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణం' చిత్రంలో మండోదరిగా కీలక పాత్ర పోషిస్తూ నేషనల్ వైడ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బాలీవుడ్ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తూ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఎంతో ప్లాన్డ్‌గా కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వారి త్యాగాల ఫలితమే నేటి ప్రశాంత వాతావరణం
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** శాంతిభద్రతల పరిరక్షణ, దేశ సరిహద్దుల రక్షణలో విధి నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం ఏఆర్ హెడ్క్వార్టర్స్లోని అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అమరవీరులకు నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు, కలెక్టర్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, న్యాయమూర్తి హుస్సేన్ నాయక్, అదనపు ఎస్పీ పి.మౌనిక, ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టె తదితరులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది విధి నిర్వహణలో, దేశ రక్షణలో ప్రాణాలర్పించిన 154 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లను అదనపు ఎస్పీ పి.మౌనిక చదివి వినిపించారు. అనంతరం సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించి, శోక్ శస్త్ర ద్వారా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోలీసులు ప్రాణాలను సైతం అర్పిస్తు న్నారని అన్నారు. పోలీసుల నిస్వార్థ సేవలకు ప్రజలు సహకరించాలని, నేర నియంత్రణలో ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ నిరంతరం స్మరిం చుకోవాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో భారత సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై చైనా సైనికులు దాడి చేయగా, ధైర్యంగా పోరాడిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది వీరమరణం పొందారని తెలిపారు. వారి స్మారకంగా ప్రతి ఏడాది అక్టోబర్ 21న దేశ వ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను పది రోజుల పాటు ప్రజాహిత కార్యక్రమాలతో నిర్వహి స్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత సమాజం డ్రగ్స్కు వ్యతిరేకంగా పోరాడుతోందని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. తెలంగాణ పోలీసు శాఖ అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం అమర వీరుల కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. ఏ సమస్య ఉన్నా జిల్లా పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండో బెటాలియన్ కమాండెంట్ బి.వెంకటేశ్వర రెడ్డి, డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, పోలీసు అధికారులు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, రెండో బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ నుంచి పలువురు టీఆర్ఎస్లో చేరిక

- సిరికొండ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సిడాం గణేష్ నియామకం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బోథ్ నియోజకవర్గంలోని సిరికొండ మండలం రాంజీగూడ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిరికొండ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సిడాం గణేష్ను నియమించారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పార్టీలో చేరిన వారికి బుధవారం కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సిడాం గణేష్కు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నూతనంగా నియమితులైన అధ్యక్షుడికి సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపురావుకు సిడాం గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, గిరిజనుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సతీష్, సనఉల్లా, సీతారాం, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వివో భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామపంచాయతీ పరిధిలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకం కింద చేపట్టిన వివో భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. బుధవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ డోంగ్రే ప్రకాష్కు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. వివో భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సమావేశాలు, ఇతర కార్యకలాపాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ మహిళలకు ప్రయోజనం చేకూర్చే ఈ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

# జైనూర్లో ఎంఆర్పీ, తయారీ తేదీ లేని బ్రెడ్ ప్యాకెట్..

- వినియోగదారుల ఆరోగ్య భద్రతపై ఆందోళన..!

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాల ప్యాకెట్లపై ధర, తయారీ తేదీ, గడువు తేదీ వంటి వివరాలు ఉండటం వినియోగదారులకు ఎంతో ముఖ్యం. అయితే బ్రెడ్ ప్యాకెట్పై ఎంఆర్పీ (గరిష్ఠ చిల్లర ధర), తయారీ తేదీ, గడువు తేదీ స్పష్టంగా కనిపించడం లేదు. వినియోగదారులు కొనుగోలు చేసే ఆహార పదార్థాల నాణ్యత, వాటి తయారీ వివరాలు తెలుసుకునే హక్కు కలిగి ఉంటారు. ప్యాకెట్పై అవసరమైన వివరాలు లేకపోతే ఆ ఉత్పత్తిని కొనుగోలు చేయాలా.. వద్దా అనే విషయంలో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. మండలంలో విక్రయించే ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై సంబంధిత వివరాలు ఉన్నాయా.. లేదా అనే అంశాన్ని పరిశీలించాలని వినియోగదారులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్పత్తులు విక్ర యిస్తున్నట్లు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





# వంగ రాజేశ్వర్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు



**ఉద్యమ కెరటం, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలో సామాజిక సేవకుడు వంగ రాజేశ్వర్ రెడ్డిని మంగళవారం పలువురు అభిమానులు, ప్రముఖులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలి యజేశారు. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డితో ఆత్మీయంగా ముచ్చటించి, పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఖాసీం, షాదుల్, సిరిసిల్ల జిల్లా ఉద్యమ కెరటం స్టాఫ్ రిపోర్టర్ షేక్ షబ్బీర్, మదార్, షేర్వాలే షాదుల్, గజకీత కృష్ణ, తంగళ్లపల్లి మాజీ ఎంపీటీసీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి ఆడే గజేందర్ కృషి

**ఉద్యమ కెరటం, బోథ్:** బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ (ఆర్జీపీ ఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తరించేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసీ గూడేలు, గిరిజన తండాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా



సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలకు ప్రాధాన్యమి స్తున్నట్లు తెలిపాయి. గిరిజనుల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి అంశాలపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు.

# ఆలయంలో చోరీ కలకలం

- క్లూస్ టీమ్తో ఆధారాల సేకరణ.. దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్బా తండా గ్రామ సమీపంలో ఉన్న ఆలయంలో బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన కలకలం రేపింది. ఆలయంలోని విలువైన ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సమాచారం అందడంతో నేరడిగొండ పోలీసులు స్పందించారు. ఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక పరిశీలన చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా ఘటన స్థలంలోని ఆధారాలు చెదిరిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. క్లూస్ టీమ్ సహకారంతో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. చోరీకి సంబంధించిన వివరాలను సేకరిస్తూ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.



ఆలయంలో జరిగిన చోరీ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, అపహ రణకు గురైన ఆభరణాల విలువ తదితర అంశాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- అమరవీరులకు నివాళులు అర్పించిన కలెక్టర్ దివాకర టి.ఎస్





**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితోనే సమాజంలో శాంతిభద్రతలు, సౌభ్రాతృత్వం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లోని పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, పోలీస్ కమిషనర్, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. మొదట పోలీసు సాయుధ బలగాలు పరేడ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించగా, అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 155 మంది పోలీసు అమర వీరుల పేర్లను ఏఆర్ అదనపు డీసీపీ కుమారస్వామి చదివి వినిపించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను కలెక్టర్, పోలీస్ కమిషనర్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో సైన్యం, ప్రజల రక్షణలో పోలీసు శాఖ కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పోలీసు సిబ్బంది నిబద్ధత, సేవా తత్పరత, త్యాగాలు శాంతిభద్రతల పరిర క్షణకు పునాదులని పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు అండగా నిలుస్తూ సహకరిస్తున్న వారి కుటుంబ సభ్యుల సేవలు, త్యాగాలను కూడా గుర్తించాలని అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, నూతన తరహా నేరాలు సమాజానికి సవాలుగా మారుతు న్నాయని పేర్కొన్నారు. వీటిని సమర్థ వంతంగా అరికట్టేందుకు తెలంగాణ పోలీసు శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు భావిత రాలకు ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం, మరణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి

- డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి డిమాండ్
- జవహర్ నగర్ డంపింగ్ యార్డు విషవాయువుల మహమ్మారికి అమాయక ప్రాణం బలీ
- భయం, ఆర్థిక ఇబ్బందులతో రాంకీ సంస్థపై పోలీసు కేసుకు అంగీకరించని కుటుంబ సభ్యులు



**ఉద్యమ కెరటం, జవహర్ నగర్:** జవహర్నగర్ రాంకీ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులు, వరుసగా సంభవిస్తున్న మరణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషవా యువుల కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై శాస్త్రీయంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కీసర సర్కిల్ పరిధిలోని జవహర్నగర్ జీహెచ్ఎంసీ ప్రాంతం, ఈస్ట్ నందమూరి నగర్, గబ్బిలాలపేటకు చెందిన మహ్మద్ సలీం (40) మంగళవారం తెల్లవారుజామున శ్వాస తీసుకో వడంలో ఇబ్బందితో మృతిచెందినట్లు షేక్ షావలి, జేఏసీ కన్వీనర్లు మహ్మద్ జావేద్, వైఎస్సార్ నగర్కు చెందిన శారద పేర్కొన్నారు. బుధవారం మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. సలీం మృతికి డంపింగ్ యార్డు నుంచి వెలువడే వాయువులే కారణమా అనే అంశంపై అధికారిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇటీవల వరుసగా సంభవిస్తున్న మరణాలపై డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజలకు అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని గుర్తుచేశారు. అంబేద్కర్ నగర్ చెందిన డి.అరుణ, గబ్బిలాలపేట గాదరి సోమయ్య, వైయస్సార్ నగర్ బొల్లం క్రిష్ణా లాంటివారు శ్వాస సంభందింత సమస్యలతో కన్నుమూశారని ఆరోపించారు. మృతుడు సలీంకు ఎలాంటి చెడు అలవాట్లు లేవని, వ్యాపారం చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం గద్వాల జిల్లా, గట్టు మండలం, గొల్లపల్లి గ్రామం (గొర్లకాం) నుంచి జవహర్ నగర్ ప్రాంతానికి వలస వచ్చి స్థిరప డ్డాడని అన్నారు. గత రెండు, మూడు నెలలుగా రాంకీ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వాసన, అర్ధరాత్రి పూట వెలువడే విష వాయువులు, పొగలతో ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉందని, భరించలేని దుర్గంధంతో రాత్రంతా ఉక్కిరిబిక్కిరి అవుతు న్నామని స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు వాపోయారని అన్నారు. ప్రజల నుంచి సందేహాలు, అనుమానాలు వ్యక్తమ వుతున్న క్రమంలో ప్రజా ఆరోగ్యం, వరుసగా సంభవిస్తున్న అసహజ మరణాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రాంకీ చెత్త డంపింగ్ యార్డును జవహర్ నగర్ ప్రాంతం నుంచి శాశ్వతంగా తొలగించే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు రాజకీ యాలకు అతీతంగా ఎమ్మెల్యే, ఎంపీ, డిసిసి అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ఎలాంటి మీనవేశాలు లెక్కించకుండా, ప్రజల ప్రాణాలు హరిస్తున్న రాంకీ డంపింగ్ యార్డును బేషరతుగా ఎత్తివేతకు, గ్రేటర్ హైదరాబాద్ నుంచి జవహర్ నగర్ కు చెత్త తరలింపును వెంటనే నిలిపివేసేలా ఐక్యంగా స్పందించాలని కోరారు. మృతుడు మహ్మద్ సలీం కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి, అన్నివిధాలా ఆదుకో వాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ నుండి వెలువ డుతున్న విష వాయులు, దుర్వాసనలపై అకాల మరణానికి గురైన బాదిత సలీం కుటుంబ సభ్యులచేత వైద్య, పోలీసు శాఖల ద్వారా వాస్తవాలు నిగ్గు తేల్చడానికి గాలీ, నీరు, భూమి నాణ్యతపై పరిక్షలు చేయించేలా కేసు నమోదు చేయించి, విచారణ జరిపించాలన్నారు. కానీ బాధిత కుటుంబీకులు భయం, ఆర్థిక సమస్యలు, బంధువుల ఆందోళనల నేపథ్యంలో పోస్టుమార్టం, పోలీసు కేసు లాంటి వాటికి అంగీకరించ లేకపోయారని తెలిపారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు సమిష్టి కృషి చేయాలి

- మొదటి ప్రాధాన్యత ఓట్లు తోనే విజయం సాధించాలి
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**ఉద్యమ కెరటం,దమ్మపేట:**
ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో శ్రీశ్రీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార ప్రణాళిక పట్టభద్రులను కలవడం పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి ఖమ్మం లోక్సభ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి, సర్వోత్తమరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరు అయిన ఈ సమావేశంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పట్ట భద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలను అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలు ప్రచారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేసి పార్టీ విజయానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట, జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు,వివిధ మండలాల పార్టీ బాధ్యులు, దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, సీనియర్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, వనమాల సూరిబాబు, అన్నవరపు నాగేంద్రరావు, సోషల్ మీడియా బాధ్యులు రషీద్, పట్టభద్రులు గట్ల నాగరాజు, పిట్టల శ్రీనివాసరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక గీతం విడుదల

- తెలంగాణ మాస్ యాసలో ఆకట్టుకునేలా 'బందోబస్తేలే.. బాడీగార్డులే.. బయలెల్లొచ్చావే వివేకన్నా..' పాట

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్ కేపీ వివేకానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక గీతాన్ని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు.

బందోబస్తేలే.. బాడీగార్డులే.. బయలెల్లొచ్చావే వివేకన్నా.. బాధంటే చాలే.. భయమెయ్యాదాయే.. బలమై వస్తావే వివేకన్నా.. అంటూ సాగే ఈ పాట తెలంగాణ మాస్ యాసలో, స్థానిక భాషా శైలిలో ఆకట్టుకునే పదాలతో రూపొందింది. ప్రజలకు అండగా నిలిచే నాయకుడిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్పై అభిమానులు చూపిస్తున్న ఆదరణను, ఆయన పట్ల ఉన్న అభిమానాన్ని ఈ గీతం ప్రతిబింబించేలా ఉంది. ఈ ప్రత్యేక గీతం రూపకల్పనలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించగా, నల్గొండ గద్దర్ పాటను ఆలపించారు. బుల్లెట్ లక్ష్మణ్ గీతానికి సాహిత్యం అందించారు. తెలంగాణ మట్టి వాసనను ప్రతిబింబించే మాస్ శైలిలో రూపొందిన ఈ పాట, ఎమ్మెల్యే అభిమానులను ఆకట్టుకునేలా సాగింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ గీతాన్ని విడుదల చేయడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. జన్మదిన వేడుకలకు ఈ ప్రత్యేక గీతం మరింత సందడి తీసుకురానుందని నాయకులు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బొజ్జును కలిసిన సిరికొండ కాంగ్రెస్ నాయకులు




**ఉద్యమ కెరటం, సిరికొండ:** ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ను మంగళవారం సిరికొండ మండల కాంగ్రెస్ నాయకులు స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, మాజీ అధ్యక్షుడు షేక్ ఇమామ్ ఎమ్మెల్యేకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ సిరికొండ మండలంలోని తాజా పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



**ఉద్యమ కెరటం,కుకునూరుపల్లి:**
గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం దుర్గామాత శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. దుర్గామాత శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరంతా ఉత్సాహంగా సాగింది. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి నామస్మరణలు, భక్తి గీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇండ్ల కనకయ్య, ఉపాధ్యక్షులు ఈగ ప్రశాంత్, క్యాషియర్ అన్నమైన బాలనర్సయ్య, కొంతం కర్ణాకర్, రాయారపు శ్రీనివాస్, కొంతం రవీందర్, ఇండ్ల శ్రీశైలం, కొంతం నాగరాజు, ప్రధాన అర్చకులు శివగోవింద శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి

**ఉద్యమ కెరటం,జగిత్యాల/వెల్గటూర్ :**
వెల్గటూర్ మండలంలోనీ కిషన్ రావు పేట గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొమురయ్య, శ్రీనివాస్ల కుటుంబాన్ని రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గుండెపోటుతో మృతి చెందిన మొకనపెల్లి చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సప్ప తిరుపతి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

- జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

**ఉద్యమ కెరటం,హైదరాబాద్ ప్రతినిధి:** బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ తన జన్మదినం సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ను శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్కు ఆశీస్సులు అందించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ భేటీ ఆత్మీయ వాతావ రణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.